# రాంభజన

రాత్రి తొమ్మిది గంటలైంది.

దేవాలయం ముందు కోలాహలంగా వుంది.

దీపస్థంభానికి చుట్టూ గుండ్రంగా నిల్చుని చెక్కభజన చేస్తున్నారు. యువతీ యువకులు. మధ్యనున్న భజన గురువు పాటపాడుతూ అడుగులేస్తోంటే అతన్ని అనుసరిస్తున్నారు.

అడుగులకు అనుగుణంగా కుడిచేతి చెక్కపలకల్ని లయబద్ధంగా వాయిస్తూ, ఎడమచేతిని గాల్లో వూపుతున్నారు యువకులు.

గజ్జెలు కట్టిన చిన్నితువాళ్ల కొసల్ని కుడిచేతి చిటికెన వేలికి ముడేసుకొని లంగా కుచ్చెళ్లను ఎడమచేతి మునివేళ్లతో సుతారంగా పట్టుకొని అందంగా అడుగులేస్తున్నారు యువతులు.

అలవాటయ్యేంతదాకా నెమ్మదిగా అడుగులేయిస్తూ, ఆపై హుషారు రేపుతున్నాడు భజన గురువు. మెరుపులా కదలుతున్నాడు. అడుగులు మారుస్తున్నాడు.

అడుగుల వేగం పెరిగింది. పాటతోటే పలకల శబ్దం తారాస్థాయినందుకొంది.

"లేచెర లేడి... గగనామందున
లేడి గాదు.... బంగారు లేడిర..."

ఎగుల్లాయి పెట్టాడు. దుమ్ము మేఘాలు లేచాయి. చెమట్లు కారిపోతున్నాయి. చుట్టూ గుమిగూడిన వీక్షకులందర్నీ దుమ్ము కమ్మేసింది.

ఊరువూరంతా అక్కడే వుంది.

వీధిలైట్లు లేకపోవటం వలన సందులు గొందులన్నీ చీకట్లలో మునిగివున్నాయి. ఇంటిదాకా పోయి చూసివద్దామని మనస్సు పీకుతోన్నా 'యీపాట వినిపోదాం, యీ అడుగు చూసిపోదా'మని అలాగే నిల్చుని వున్నారు జనమంతా.

"గొల్లవారి వాడలాకు క్రిష్ణమూర్తీ
నీకేంపని వున్నదోయి చిన్నిమాధవా!"

ఆది అడుగునించి కుప్పడుగుదాటి, చక్రపు అడుగు చుట్టి, అయిదో అడుగు మీదుగా అర్జున అడుగుదాకా వెళ్లింది భజన. అడుగుల తాకిడికి భూమి దద్దరిల్లుతోంది.

చేతుల లయను, అడుగుల విచిత్రాల్ని వూపిరి బిగబట్టి చూస్తున్నారు జనమంతా.

అదే సమయంలో దక్షిణపు వీధిలోని ఓ చుట్టింటి తడికల వాకిలి విసురుగా తెరచుకొంది.

జారిపోయిన జుట్టు ముడేసుకొంటూ వీధినబడి వేగంగా నడవసాగింది గురమ్మ. వీధిమలుపు తిరిగి వెనక్కి చూసేసరికి పరుగెత్తుకొస్తూ కన్పించాడు ఆమె మొగుడు నారయ్య.

ఒక్క ఉరుకుతో దేవాలయం వద్ద కెళ్లింది ఆమె. ఆడాళ్ల మధ్యగా తావుచేసికొని ఓ చోట కూచుంది.

జనాలకు పదిగజాల దూరంలో గోడవారగా ఆగిపోయాడు నారయ్య.

భయంతో ఆమె రావటాన్నీ, వెంటాడిన అతని వేగాన్నీ ఎవరూ గమనించలేదు.

తేపతేపకూ ఆమెకేసి చూస్తున్నాడు నారయ్య. అబ్బిళ్లు కొరుకుతున్నాడు. సారాయి మత్తువల్ల పల్చగా మొద్దుబారిన మొహాన్ని అరచేత్తో రుద్దుకొంటున్నాడు. గుంపులో జొరబడాలని వుంది అతనికి. గురమ్మను జుట్టుపట్టుకొని జరజర ఇంటిదాకా యీడ్చుకెళ్లి మంచంలో కూలేయాలనేంత నరాల తీపిగా వుంది. అయితే ఆడాళ్ల మధ్యకు వెళ్లడానికి అతనికి భయంగా వుంది. పిచ్చికుక్కను కొట్టినట్లు కొడతారేమోనని భయం. అందుకే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

గురమ్మ మాత్రం చాలా ధీమాగా వుంది. అటుఇటు చేయిచాచి వక్కాకు అది నమలుతూనే ఓరగంట మొగుణ్ని గమనిస్తూ వుంది.

కొంతసేపు మంద్రంగా సాగిన చెక్కపలకల వాదెన రాజుకొని రాజుకొని భగ్గునమండిన మంటలా ఒక్కసారిగా పైకెగసింది. నెమ్మదిగా పడుతోన్న అడుగులు మలుతిరిగిన కొండవాగులా వొడుపందుకొన్నాయి. పది నిమిషాల సేపు అందరి వూపిరుల్ని ఆపేస్తూ ఆగిపోయింది కులుకుడు భజన.

మంగళహారతి ఇచ్చేటపుడే ఆడవాళ్లంతా దుమ్ము దులుపుకొంటూ లేచినిల్చున్నారు.

ఆమెకేసే జాగ్రత్తగా చూస్తున్నాడు నారయ్య. తప్పించుకొంటుందేమోనని అనుమానంగా వుంది.

నిజంగానే తప్పించుకొంది. ఆమె – అమ్మలక్కల చాటుగా.

అటువెదికాడు. ఇటు వెదికాడు. పరుగు పరుగున ఇంటిదాకా వెళ్లి చూశాడు. మళ్లీ వీధిన పడ్డాడు.

పెళ్లాం మీద కసిగా వుంది అతనికి. తన్ను మాయజేసిందనే ఉక్రోషం ఆమె పట్ల చచ్చేంత కోపాన్ని రగిలించింది.

దేవాలయం వద్ద ఇప్పుడు జనమెవ్వరూ లేరు.

వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

ఏ యింట్లో దాక్కొందో అర్థం కాలేదు.

ఎవరి అండ చూసికొందో తెలీలేదు.

నరాల తీపి ఓవైపు. దాన్ని మించిన పట్టుదల మరోవైపు

దేవాలయం నీడలో నిల్చుని బీడీమీద బీడీ కాల్చుతున్నాడు.

ఉన్నట్టుండి అతనికి 'మొగుణ్ని విడిచొచ్చిన సుబ్బమ్మ' గుర్తొచ్చింది.

దాక్కున్న మరుగు ఎక్కడో అర్థమైనట్లుగా అన్పించింది.

మెల్లగా ఆ యింటికేసి నడిచాడు.

సందులో దూరి వాకిలిముందు నిల్చున్నాడు.

తడికల వాకిట్లోంచి చీకట్లుతప్ప ఏమీ కన్పించటం లేదు.

చేయివేసి మెల్లిగా తోశాడు.

తడికలు కిటకిటమన్నాయి.

లోపల గుసగుసలు.

"వచ్చినట్టుండాడు నాబట్ట. నేనేం జేసేను తల్లో..." పెళ్లాం గొంతే.

సుబ్బమ్మ ఏదో చెబుతోంది.

మంచం మీంచి దిగిన చప్పుళ్ళు.

నారయ్యలో ఆరాటం - 'తప్పించుకు పోతుందేమో'నని

వెనక ముందు ఆలోచించకుండా రెండు చేతుల్తో తడికల వాకిలి పైకెత్తాడు.

ఇంట్లోకి జొరబడ్డాడు.

కళ్ళకేమీ కన్పించట్లేదు. మంచాలెటువున్నాయో అర్థంకాలేదు. కాళ్ళు, చేతులతో తడువుతూ అటు ఇటు జరిగాడు.

మంచం కోడు మోకాలికి పొడుచుకొంది.

జివ్వుమని ఎగబాకుతోన్న నెప్పిని పట్టించుకోకుండా రెండు చేతుల్ని మంచం మీదుగా హుషారుగా విసిరాడు.

చేతులకు ఆడమనిషి శరీరం దొరికింది.

ఒక్క ఉదుటున ఆ శరీరం మీద పడ్డాడు.

"సంపితివి గదరా నా బిట్టా!" సుబ్బమ్మ గొంతు. "ఓయమ్మా! యీ తాగుటోతునా బిట్ట సూడూ..." గట్టిగా కేకేసింది.

వదిలాడు ఆమెను.

"నా పెండ్లామేదీ?" అడిగాడు.

"దొడ్డిదావన పొయ్యిందిపోరా నీ తలపుండు పగలా! ఎవురంటే వాళ్లను పట్టుకొంటవ్. కండ్లు కనపల్లే? మెట్లిరుగుతాయ్." గట్టిగా అరుస్తూ తిట్లకు లేచింది.

"నా పెండ్లాన్ని నీపక్కన పండబెట్టుకొంటే నాపక్కలేకి ఎవురొస్తరూ?" కసుక్కన నవ్వుతూ ఇల్లుదాటాడు.

ఆమె కేకలకు ఇరుగుపొరుగులు అక్కడికొచ్చారు.

విషయం తెలిసికొని, గురమ్మకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆమెనే మందలించారు.

మరోసారి ఇంట్లోకెళ్లి వచ్చాడు నారయ్య

పెళ్లాం ఇంట్లోలేదు.

ఎక్కడ వెదకాలో అర్థం కాలేదు.

కోరిక కంటే పట్టుదల అధికమైంది.

పదిరోజులైంది దగ్గరకు రానీక.

ఏడాది కాలంగా ఇదేగొడవ. పిల్లోన్ని కన్నప్పట్నించీ యీ యేధుపే. 'అక్కడ నెప్పి అంటది' ఇక్కడ పానాలు పోతుందా' యంటది. అయినా ఏదొక విధంగా తను కక్కుర్తి పడుతున్నాడు. పదిరోజుల్నించి మరీ చేయికూడా వేయనీయటంలేదు.

తన ప్రశ్న ఒక్కటే - పగలంతా రెక్కలు ముక్కలు చేసికొని వస్తేసే ముండకు, మొగుడు కనబడగానే అంతలావు నెప్పి ఎట్లా వస్తది?

ఇంటిముందు కూచుని బీడీ మీద బీడీ పీలుస్తున్నాడు.

అనుమానం చావక మరోసారి ఇంట్లోకెళ్లి మంచంమీద చూశాడు.

చిన్న పిల్లాడు ఆదమరచి నిద్రిస్తున్నాడు.

మళ్లీ వచ్చి ఇంటిముందు కూచున్నాడు.

కైపు తెరలు విడిపోతున్నాయి.

నిద్ర తెరలు వచ్చి కళ్లమీద వాలేట్టు లేవు.

తలంతా అలజడిగా వుంది.

కలుగులోంచి ఆమెను బైటకు రప్పించే ఉపాయాల్ని వెదుకుతున్నాడు.

ఉన్నట్టుండి సన్నని ఏడుపు.

తన పిల్లాడిదే అనుకొని లోపలికి తొంగిచూశాడు.

పక్కింట్లోంచి వస్తోన్నట్లుగా అర్థమై సర్దుకొంటూ, అది పిల్లాడి ఏడుపు కాదని జంగుపిల్లి అరుపని తెలిసివచ్చి నవ్వుకొన్నాడు.

ఆ వెనకే అతని మెదడులో ఓ ఆలోచన.

పిల్లాడి ఏడుపు తనలోనే ఇంత కదలిక తెస్తే ఇక తల్లిని ఎంతగా అలజడికి గురిచేస్తుందో గదా!

చావు తెలివి ఒకటి వచ్చి అతనిలో జొరబడింది.

బీడీదమ్ము చివరిదాకా పీల్చి విసరికొడ్తూ ఇంట్లోకెళ్లాడు.

మంచమ్మీదకు తొంగిచూశాడు.

పట్టెమీద కూచుని పిల్లాడికేసి చేయిచాచాడు.

గుడ్డి వెలుతుర్లో సైతం పిల్లాడి పెదాల మీద దేవుళ్లనవ్వు.

"నేనిట్లా సస్తాంటే నీకు నవ్వొస్తాందిరా నాకొడకా!" అనుకొన్నాడు నారయ్య. వెనక ముందు ఆలోచించకుండా కప్పిన గుడ్డమీంచే ఆ పసిగుడ్డు తొడగిల్లాడు.

ఉలిక్కిపడి లేచాడు వాడు.

ఆ ఉలికి పాటులోంచే బిగ్గరగా ఏడుస్తూ కళ్లు తెరిచాడు.

ఏడుపు శబ్దం ఏమంత బిగ్గరగా తోచలేదు నారయ్యకు. జంగుపిల్లి అరుపులాగా కాదు. కప్పెగిరి పోయేలా వుండాలి. ఊరంతా విన్పించాలి.

మరింత గట్టిగా తొడపాశం పెట్టాడు.

గొంతునాళాలు తెగేలా ఏడవటం మొదలెట్టాడు పిల్లవాడు. వాకిలి విసురుకొనేలా, పిల్లులు పారిపోయేలా, వాడి ఏడుపు శబ్దం ఇల్లుదాటి, వీధి దాటి, వూరంతా కమ్ముకొనేలా ఏడ్వసాగాడు.

పక్కనే సిద్దులక్షుమయ్య ఎద్దుల కొట్టంలో ఖాళీగా వున్న పశువుల గాడిలో పడుకొని వుంది గురమ్మ. అక్కడికి మొగుడు రాలేదని ఆమెకు తెలుసుగాని, కొడుకు ఏడుపు గోడలు చీల్చుకు రాగలదని వూహించలేదు.

చివుక్కున లేచి కూచుంది.

పసివాడి ఏడుపుకు ప్రతిస్పందిస్తూ కన్నపేగు మెలికలు తిరగసాగింది.

అక్కడ మొగుడుంటాడనీ తెలుసు.

అతని కళ్లల్లో తన్ను చంపేసే రాకాసి కోరిక ఒకటి ఉంటుందనీ తెలుసు.

పొత్తికడుపు నెప్పిని సవరించుకొంటూ మెల్లిగా లేచి కోక దులుపుకొంటు గట్టిగా వూపిరి పీల్చుకొని గుండెదిటవు పరచుకొంటూ కొప్పుముడి వేసికొంది.

ఎద్దుల కొట్టంలోంచి బైటకు నడిచింది.

దిబ్బదాటి, తెట్టుగోడదాటి ఇంటివద్దకు చేరుకొంది.

వాకిలి తెరిచే వుంది.

సద్దుగాకుండా తలుపు వద్దకు నడిచి మెల్లిగా లోపలికి తొంగిచూసింది.

ఏడుస్తోన్న పిల్లాడి పక్కనే కూచునివున్నాడు అతను.

సముదాయించేందుకూడా ప్రయత్నించలేదు.

"ఏడ్సురా నాకొడకా! మీయమ్మ వొచ్చేదాకా ఏడ్సు" అంటున్నాడు.

ఉలికిలికిపడి ఏడుస్తున్నాడు వాడు.

ఆమెకు అర్థమైంది.

తనమీద కసి వాడిమీద చూపిస్తున్నాడు కాబోలు.

గుండె తరుక్కుపోయింది ఆమెకు.

ఒక్క అంగలో లోపలికి జొరబడింది. పిల్లాన్ని చేతుల్లోకి తీసికొని గుండెలకు అదుముకొంది.

చివుక్కున మంచమ్మీంచి లేచివెళ్లి తలుపేశాడు నారయ్య.

ఆమె బైటకు పారిపోతుందని అతని అనుమానం.

అతనికేసి చూడనైనా చూడలేదు గురమ్మ.

పిల్లాన్ని ఎదలకు హత్తుకొని పాలిచ్చేందుకు ప్రయత్నించింది.

వాడింకా ఏడుపు మానలేదు. చనుమొనను నోట అందుకోలేదు.

కనుగుడ్ల మీద గిర్రున నీళ్లు తిరిగాయి ఆమెకు. గుండెగోడలు కరిగి కనుగొలుకుల్లోకి స్రవించసాగాయి.

మొగునికేసి తీక్షణంగా చూసింది.

'ఇక తప్పించుకోలే' వన్నట్లుగా వెకిలి నవ్వు నవ్వుతూ వాకిలిని ఆనుకొని గొంతుక్కూచున్నాడు.

తల్లిమీద అసహనాన్ని ప్రదర్శిస్తూ కాళ్లు చేతులు జాడిస్తున్నాడు పసివాడు.

వాడికాలు పొత్తికడుపులో తగిలి నరాలు తెగినట్లనిపించింది ఆమెకు. పానాలుగ్గపట్టుకొని ఓపిగ్గా వాన్ని సముదాయిస్తూ ఎదలకు అంటించుకొంది.

పెళ్లయిన ఎన్నో ఏళ్లకు పుట్టిన నలుసువాడు. అప్పటికే తన ఆరోగ్యం బాగా దెబ్బతిని వుంది. మొగుడు తనపాలిట గోమారి కుదురయినాడు. పానాల్దీసే యముడైనాడు. వారానికి రెండ్రోజులు కూడా పనికి పోడు. సారాయి తాగుతూ గోడకింద కూకొని వుంటాడు. తను తెచ్చిన కూలి కూడా వాని బొక్కన కొట్టుకొంటాడు. తనను కూలికి పంపిస్తానని ముందస్తు అప్పులు కూడా తెచ్చుకొని తాగుతాడు. ఎద్ది మొత్తుకొంటే పైనబడి కొడతాడు. సరైన తిండిలేక, వాని దెబ్బలకు తట్టుకోలేక కునిష్టిగా వున్నదాని కడుపున పాపిష్టి దేవుడు యిదో యీ నలుసును పడేశాడు. వీడ్ని కనేప్పుడు ఎంత బాధపడందనీ తను! చచ్చి బతికింది. అప్పట్నుంచి వొగదెగకుండా పొత్తికడుపులో నెప్పి. ఎన్ని నెలలు చూసినా తరగని నొప్పి. డాక్టరమ్మ చెప్పింది 'ఇంక కనడం మాన'మని. 'పెద్ద పానానికి ప్రమాద'మని. 'బలమంతా పొత్తి కడుపు మీదే చూపే నీ మొగున్ని యీ బాధ మానేంత దాకా దగ్గెరకు రానియ్యొ'ద్దని. ఏవేవో మాత్రలు రాయించింది. అవి తెచ్చుకొని తినేందుకు లెక్కలేదు. మొగున్ని దగ్గరకు రానియ్యకుండేందుకు సత్తవలేదు.

పిల్లాడికి చన్ను మార్చింది.

అప్పుడే వాకిలివద్ద గొంతుక్కూచున్న నారయ్యలో కదలిక వచ్చింది.

"ఎంతసేపే పిల్లోనికి పాలిచ్చేది? వాన్నేడ కింద బడేసి లెయ్!" అన్నాడు.

రెండు చేతులెత్తి దండం పెట్టింది ఆమె. అతని పాదాలకేసి నేలమీద కొట్టి "నీ కాళ్లు పట్టుకొంటా. నా జోలికి రాగాకు సామీ! నాకు వొల్లు బాగలేదు" అంది.

కసాయి వాడి ముందు మేక అరుపులా అయ్యింది ఆమె పరిస్థితి.

"నోరెత్తితే తంతా నియ్యమ్మ! వాన్నేడ పడేసి మంచమెక్కు.. ఆటలాడెవు.. ఆటలు.. నాకాన్నే..." అంటూ అరిచాడు.

ఆమె ఏడుస్తోంది.

ఆలస్యాన్ని భరించలేకపోయాడు నారయ్య. ఆమె వొడిలోని పిల్లాన్ని విసురుగా లాక్కొని కింద వదిలాడు. ఆమె రెండు చంకల్లో చేతులు దూర్చి ఎత్తి మంచం మీద కుదేశాడు.

తనమీద పడబోతోన్న అతనికేసి నిస్సహాయంగా చూస్తూ రెండు కాళ్లు ముడుచుకొని, రెండు చేతుల్ని ముకుళించింది ఆమె.

"నువ్వు నామీదబడితే నేను బతకన్రో నాయినో! నా జోలికి రావద్దురో! నేన్సస్తే పిల్లోడు దిక్కులేనోడయితాడురో నాబట్టో.." అంటూ రాగాలు తీసింది.

"నువ్వు సస్తే నీయమ్మట్టాంటిదాన్ని యింగోదాన్ని తెచ్చుకొంటాలే..." అంటూ ఆమె మీద పశువులా పడ్డాడు నారయ్య.

మనస్సులో ఎక్కడో పుటుక్కున తెగినట్లయింది గురమ్మకు.

తనమీద ప్రేమలేదు. కన్నబిడ్డమీద లేదు. తనను చంపి అయినా కోరిక తీర్చుకొనేట్టున్నాడు. తనబిడ్డను దిక్కులేనివాన్ని చేసేట్టున్నాడు.

భరించలేకపోయింది ఆమె.

తనలో తనకే తెలీని బలమేదో కాళ్లల్లోకి పాకింది. ఆవేశం ముక్కుపుటాల్ని వొరుసుకొచ్చింది.

విసురుగా కాళ్లు ఝాడించింది.

"అమ్మా!" అంటూ రెండు చేతుల్ని తొడల మధ్యగా బిగించుకొంటూ కాళ్లకట్ట మీంచి వెల్లకిలా నేలమీద దబ్బున పడ్డాడు నారయ్య.

మొదట ఆమెకేమీ అర్థం కాలేదు.

అర్థమయ్యేసరికి మొగుడు నేలమీద గిజగిజ తన్నుకొంటూ కన్పించాడు.

మరోవైపు పిల్లవాడు ఏడుస్తున్నాడు.

ఆమెకు కాళ్లు చేతులు ఆడలేదు. ఒళ్లంతా చెమటలు పట్టాయి.

మంచం దిగి అతన్ని సమీపించింది.

ఏం చేయాలో అర్థం కాలేదు.

కంగారుగా చూసింది. గాభరా పడింది. "ఓయమ్మో!" అంటూ ఎలుగెత్తి ఏడ్చింది

ఇరుగమ్మ పొరుగమ్మ గుమిగూడింది. ఆయప్పా, యీయప్పా పోగయ్యారు. ఉరుకు పరుగుల మీద ఆసుపత్రికి తీసికెళ్లారు.

కొన్ని దినాల తర్వాత కునిస్టిగా ఇల్లు చేరాడు నారయ్య.

అప్పుడు పొయ్యిగడ్డలు సరిజేసింది గురమ్మ.

కుండచట్టి తుడిచి పెట్టింది.

చాలా రోజులుగా ఇంట్లో సరిగ్గా వంట చేసిన పాపాన పోలేదు. ఉప్పుంటే పప్పుండదు. అడుగులుంటే పిండి వుండదు. ఉల్లిగడ్డ వుంటే మిరపకాయ వుండదు. ఆయమ్మనో యీయమ్మనో దేబిరించి ఉప్పో, ఊరగాయో పెట్టించుకొచ్చి కాలం గడుపుకొనేది.

కానీ ఇప్పుడాయె ఎవ్వరివద్దా చేయి చాచదల్చుకోలేదు.
కూలి సొమ్ముతో అన్నీ కొన్నుక్కొంది.
తెల్లని వరిమెతుకులకు పప్పుచారు కలిపి మొగునికి చేతులారా తినిపించింది.
వరి మెతుకుల్ని మెత్తగా పిసికి కొడుక్కి నోటబెట్టింది.
చంటోన్ని మొగుని వద్ద వదలి ఆమె పనికి పోతోంది.
ఇప్పుడతను పెళ్లాన్ని తిట్టేందుక్కూడా సాహసించటం లేదు.
పెట్టింది తిని కొడుకునే కనిపెట్టుకొని ఇంటి పట్టున్నే ఉంటున్నాడు.
రోజులు గడుస్తున్నాయి.
కూలిగింజల్తో కుటుంబం నడుస్తోంది.
"మొగున్ని మంచాన పడేసినవ్. సంసారాన్నిఎట్టీడుస్తుందవే తల్లీ?" అడిగారు అమలక్కలు.
చిన్నగా నవ్విందామె.
"నేను అనగూడదుగానీ అక్కా! నా పానానికిప్పుడు సుగంగా వుంది." అంది.
"మంచంలో వుంటేనేమీ? నాకు నా సంటి పిల్లోడూ ఆయప్పా ఇద్దరూ ఒకటే. ఇద్దరూ నా పిల్లోల్లే. కూలిజేసి వాల్ల కడుపునిండా కూడుబెడ్తా. నాకేం బరువు లేదు" చెప్పింది.
"నలగదంచి భజన చేసింది. సాక్కోక ఏంజేస్తది!" ఒకామె అంది.
"అట్లాంటిట్టాంటి భజన కాదు. రాంభజన. దావకు రాక సస్తాదూ!" ఇంకోకామె అంది."నోరెత్తడం లేదంట బిడ్డ. కుయ్యీకయ్యీమనటం లేదంట."

● రచనా కాలం-మార్చి, 1993 ●